సాక్షి అనకాపల్లి

బుధవారం। 11। డిసెంబర్। 2024



కనకమహాలక్ష్మికి విశేష పూజలు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో మంగళవారం విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.



ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

డాబాగార్డెన్స్: మృతి చెందిన 19మంది ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాల కు ఆర్ఎం కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. కనిష్ట ఉష్ణోగ్రతలు ఈనెల 11న 22.2 డిగ్రీలు, 12న 22, 13న 22.5, 14న 22.6, 15న 22.8 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

పింఛన్ల కోతకు సర్కారు కుట్ర!

- ఏరివేతే లక్ష్యంగా ప్రత్యేక బృందాల పరిశీలన
- ప్రయోగాత్మకంగా పురుషోత్తపురం సచివాలయం పరిధిలో తనిఖీలు
- ఏదో ఒక వంకతో పెన్షన్లు తొలగిస్తారన్న ఆందోళనలో లబ్ధిదారులు



మెట్టపాలెంలో పింఛన్లను పరిశీలిస్తున్న ప్రత్యేక సిబ్బంది

యలమంచిలి రూరల్: అభాగ్యుల మెడపై చంద్రబాబు ప్రభుత్వం తనిఖీల పేరుతో కత్తి పెట్టింది. సామాజిక భద్రత పింఛన్ల ఏరివేతే లక్ష్యంగా ఎన్నో ఏళ్లుగా లబ్ధి పొందుతున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల అర్హతను పరిశీలించి, ఏదో వంకతో వారి పింఛన్లను తొలగించడానికి రంగంలోకి దిగింది. ఇందుకోసం ప్రయోగాత్మకంగా యలమంచిలి మండలం పురుషోత్తపురం సచివాలయం పరిధిలో కొత్తలి, మెట్టపాలెం, పురుషోత్తపురం గ్రామాల్లో మంగళవారం 10 ప్రత్యేక బృందాలు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి వారి అర్హతను పరిశీలించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల కాలంలో గుట్టుచప్పుడు కాకుండా పింఛన్లను తొలగిస్తుండగా ప్రస్తుతం బహిరంగంగానే పింఛన్ల ఏరివేత చేపట్టడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. తమ పింఛన్ ఉంటుందా? ఊడుతుందా? అన్న భయం వారిని వెంటాడుతోంది. పింఛన్‌దారుల పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ మరోసారి వారి సమాచారం సేకరించడానికి.. పింఛన్లకు కోత పెట్టే దురుద్దేశమే కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

10 ప్రత్యేక బృందాలతో జల్లెడ

యలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామ సచివాలయం పరిధిలో పైలెట్ ప్రాజెక్ట్ కింద మంగళవారం చేపట్టిన పింఛన్ వెరిఫికేషన్‌లో 10 బృందాలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి నుంచి వివరాలు సేకరించాయి. ఈ వివరాలను ప్రభుత్వం రూపొందించిన మొబైల్ అప్లికేషన్‌లో నమోదు చేశారు. వివరాలతో పాటు లబ్ధిదారుల ఫొటోలను కూడా యాప్‌లో నిక్షిప్తం చేశారు. ఈ సచివాలయం పరిధిలో మూడు గ్రామాల పరిధిలో 491 మంది లబ్ధిదారులు ఉండగా వారిలో 14 మంది అందుబాటులో లేరు. ఇద్దరి ఆచూకీ లభించలేదు. పరిశీలన చేసిన బృందంలో ఇతర మండలాలకు చెందిన ఒక ఈవోపీఆర్డీ, ఒక సచివాలయ వెల్ఫేర్ అధికారి ఉన్నారు. పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియను అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, డీఎల్‌డీవో ఎస్.మంజులవాణి, యలమంచిలి ఎంపీడీవో కొండలరావు పర్యవేక్షించారు.

15 అంశాలపై ఆరా

తనిఖీల్లో అధికారులు అడిగిన వివరాలను బట్టి చూస్తే రాజకీయ సిఫార్సులతో పింఛన్లకు కోత పెట్టే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్న ఆందోళన లబ్ధిదారుల్లో నెలకొంది. ఆ కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం చేస్తున్నారా? సరాసరి 12 నెలల విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందా? లబ్ధిదారుడి కుటుంబంలో ఎవరికైనా నాలుగు చక్రాల వాహనం ఉందా, 10 ఎకరాల కంటే ఎక్కువ మెట్ట, 3 ఎకరాల కంటే ఎక్కువ మాగాణి, రెండూ కలిపి 10 ఎకరాల కంటే ఎక్కువ వుందా? మీ కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారా? పట్టణ ప్రాంతాల్లో 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ నిర్మాణం ఉందా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ ఉన్నారా? వంటి అంశాలను బృందాల్లోని అధికారులు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలపై ఫోకస్ పెట్టారు. వికలాంగులకు సంబంధించి భౌతికంగా వికలత్వం కలిగి ఉన్నారా.. లేదా? ధ్రువీకరణ పత్రంలో ఉన్న వివరాలతో సరిపోయిందా.. లేదా పరిశీలించారు. వృత్తిపరమైన పింఛన్లకు సంబంధించి వృత్తిలో ఉన్నారా, లేదా అన్నది పరిశీలించారు. తనిఖీ బృందాలు లబ్ధిదారుల కుటుంబ పూర్తి ఆదాయ వివరాలు రాబట్టే ప్రయత్నం చేయడంతో పింఛన్లు తొలగిస్తారేమోనన్న భయాందోళనలు లబ్ధిదారుల్లో కనిపించాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క లబ్ధిదారుడినీ వదలకుండా ఇంటింటికీ వెళ్లి మరీ వలంటీర్ల ద్వారా అర్హులను ఎంపిక చేస్తే.. కూటమి ప్రభుత్వం అర్హుల ఇంటింటికీ అధికారులను పంపించి పింఛన్ల ఏరివేత చేపడుతోందని పలువురు లబ్ధిదారులు మండిపడుతున్నారు.



కొత్తలి గ్రామంలో లబ్ధిదారుడి ఫొటో తీసుకుంటున్న సిబ్బంది



పురుషోత్తపురంలో లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న ప్రత్యేక బృందం సభ్యులు


షాక్ కొట్టిన స్మార్ట్ మీటర్ @ 50,050/-

- లబోదిబోమంటున్న చిరు వ్యాపారి
- వడ్డాదిలో మరి కొందరిపై విద్యుత్ బిల్లుల భారం

బుచ్చెయ్యపేట: ప్రజలపై విద్యుత్తు చార్జీల భారం మోపబోమని దగాకోరు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తన వక్రబుద్ధి ప్రదర్శిస్తోంది. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశాక రూ.వందల్లో వచ్చే విద్యుత్ బిల్లులు రూ.వేలల్లో రావడంతో చిరు వ్యాపారులు షాక్‌కు గురవుతున్నారు. బిల్లులను చూసి లబోదిబోమంటూ ఆ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాజాగా వడ్డాది గ్రామానికి చెందిన ప్లాస్టిక్ గొట్టాలు అమ్ముకునే చిరు వ్యాపారి మంచాల గోవిందకు డిసెంబర్‌లో ఏకంగా రూ.52,050 బిల్లు వచ్చింది. తన విద్యుత్ సర్వీస్ నెంబర్ 115634W002000865పై ఫిబ్రవరిలో రూ.575, మార్చిలో రూ.526, ఏప్రిల్‌లో రూ.684, మేలో రూ.411, జూన్‌లో రూ.508 కరెంట్ బిల్లు వచ్చింది. జూలైలో బిల్లు కట్టకపోవడంతో ఆగస్టులో రెండు నెలలది కలిపి రూ.1,106 బిల్లు వచ్చింది. నవంబర్ నెల బిల్లు కట్టకపోగా, ఇటీవల పాత మీటరు తీసి స్మార్ట్ మీటర్ బిగించారు.

ఈ నెలలో రూ.52,050 బిల్లు వచ్చింది. దీంతో చిరువ్యాపారం చేసుకునే ఆయన అంత మొత్తంలో బిల్లు చూసి విస్తుపోయాడు. కూటమిలో ఉండి అధికార పార్టీకి ఓటు వేసినందుకు ఇదేంటని వేలల్లో బిల్లు వస్తే ఎలా బతకాలని ఆందోళన చెందుతున్నాడు.

విద్యుత్ శాఖ అధికారులకు వెంటనే ఫిర్యాదు చేయగా, పరిశీలిస్తామని చెప్పారన్నాడు. ఇతనిలాగే మరొక వ్యాపారి పలుకూరి మల్లెపువ్వ విద్యుత్ సర్వీస్ నెంబర్ 115634W002000891కు ఏప్రిల్‌లో రూ.210, మేలో రూ.332, జులైలో రూ.176, సెప్టెంబర్‌లో రూ.411, నవంబర్‌లో రూ.474 విద్యుత్ బిల్లు వచ్చింది. ఇటీవల ఆయనకు విద్యుత్‌శాఖ అధికారులు స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేయగా, డిసెంబర్‌లో రూ.19,611 బిల్లు కట్టాలని వచ్చింది. దీంతో ఆయన షాక్‌కు గురయ్యాడు. పెయింట్లు అమ్ముకునే మరొక చిరు వ్యాపారి వరహామూర్తికి నెలకు రూ.200 నుంచి రూ.300 వరకు బిల్లు రాగా, ఈ నెలలో రూ.4,500 విద్యుత్ బిల్లు రావడంతో ఆందోళన చెందుతున్నాడు. వీరిలాగే వందలాది మంది చిరు వ్యాపారులు వేలల్లో విద్యుత్ బిల్లులు రావడంతో లబోదిబోమంటున్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్లు తీసి విద్యుత్ బిల్లులు తగ్గించకపోతే ఆందోళనకు దిగుతామని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





గతంలో ఎన్నడూ రూ.వెయ్యి దాటని గోవింద విద్యుత్ బిల్లు



విద్యుత్ బిల్లులు చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్న వ్యాపారి



డిసెంబర్ నెలలో గోవింద గుండె గు'భిల్లు'

న్యూస్‌రీల్

వర్షాలు తగ్గే వరకు వరి కోతలు వద్దు

తుమ్మపాల: ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఉత్తర కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు సూచించడంతో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. వరి పంట కోతలను వర్షాలు తగ్గే వరకు వాయిదా వేసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటికే కోసిన వరి పనలను కుప్పలుగా వేసుకొని వర్షపు నీరు కుప్పలలో చేరకుండా టార్పాలిన్ వంటివి కప్పి ఉంచాలని చెప్పారు. వర్షం వలన నీటిలో తడిచినట్లయితే గింజలు మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణంతో పిచికారీ చేసుకోవాలని, కుప్పలలో గింజ మొలకెత్తకుండా ఒక క్వింటా ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల ఊక కలిపి ధాన్యం పోగుపెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉంటుందన్నారు. జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవాలని ఆయన సూచించారు.

నేడు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం



డాబాగార్డెన్స్ (విశాఖ): మహా విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కౌన్సిల్ సాధారణ సమావేశం మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన బుధవారం జరగనుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశం కోసం 46 అంశాలతో ప్రధాన అజెండా మరో 21 అంశాలతో అనుబంధ అజెండాను సభ్యులకు అందజేశారు. అక్టోబర్ 4, 18 తేదీల్లో జరిగిన స్థాయీ సంఘ సమావేశాల్లో చేసిన తీర్మానాలు, నవంబర్ 8, 29 తేదీల్లో జరిగిన స్థాయీ సంఘ సమావేశాల్లో చేసిన తీర్మానాల వివరాలు కూడా సభ్యుల ముందుకు రానున్నాయి.

నిబంధనలకు టెండర్



జనం కంట్లో ఇసుక

- డిపోలన్నీ కూటమి నేతల మద్దతు సంస్థలకే..
- ఎన్‌వోసీ పేరిట రసవత్తర నాటకం
- నిబంధనలకు విరుద్ధంగా ఇసుక డిపోల కేటాయింపు
- జిల్లాలో 6 డిపోలకు పూర్తయిన టెండర్ ప్రక్రియ

డిపో	టెండర్ దక్కించుకున్నవారు
అనకాపల్లి	గోదావరి-కృష్ణ వాటర్ వేస్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ
అచ్యుతాపురం	నన్నపనేని ఎర్త్ మూవర్స్ సంస్థ
నక్కపల్లి	బీవీఆర్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ సంస్థ
చోడవరం, నర్సీపట్నం, మాడుగుల	మైత్రి ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్

సాక్షి, అనకాపల్లి: అనుకున్నంతా అయ్యింది.. అస్మదీయులకే ఇసుక దక్కింది.. ఇతరులకు కనీసం ఎన్‌వోసీ కూడా మంజూరు కాకుండా నిస్సిగ్గుగా నిబంధనలకు పాతరేశారు. జిల్లాలోని ఆరు ప్రైవేటు ఇసుక డిపోలను కూటమి నేతలు తమకు కావలసిన వారికే కట్టబెట్టారు. అమరావతిలో మంగళవారం సాయంత్రం లాటరీ ద్వారా నిర్వాహకులను ఎంపిక చేశారు. అనకాపల్లి, నక్కపల్లి, అచ్యుతాపురం, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రైవేటు ఇసుక డిపోలకు గత నెల 25వ తేదీన టెండర్లను ఆహ్వానించిన విషయం తెలిసిందే. మొత్తం 43 దరఖాస్తులు రాగా.. ఎన్‌వోసీ లేదని, ఇతర కారణాల దృష్ట్యా మైనింగ్ అధికారులు స్క్రూటినీలో 27 మందిని తొలగించారు. మిగిలిన 16 సంస్థలు మాత్రమే టెండర్‌లో పాల్గొన్నాయి. పైకి టెండరు ప్రక్రియ నిర్వహించినట్టు కనిపించినా తెరవెనుక స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నేతలు మద్దతు పలికిన సంస్థలకే డిపోలు దక్కేలా కథ నడిపారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనకాపల్లిలో ఎమ్మెల్యే సోదరుడి మద్దతుతో..

అనకాపల్లి డిపోకు 11 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎన్‌వోసీ లేనందున 3, ఇతర కారణాలతో 2 దరఖాస్తులను మైనింగ్ అధికారులు తిరస్కరించారు. మిగతా 6 సంస్థలు మాత్రమే టెండర్‌లో పాల్గొన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధి సోదరుడి మద్దతు సంస్థ అయిన గోదావరి-కృష్ణా వాటర్ వేస్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీకే టెండర్ దక్కింది. నిబంధనల ప్రకారం తోటల్లో ఇసుక డిపో ఏర్పాటు చేయకూడదు. ఈ సంస్థ చూపించిన 4 ఎకరాల స్థలంలో కొబ్బరి తోట ఉన్నా రెవెన్యూ అధికారులు ఎన్‌వోసీ ఇచ్చారు.

నక్కపల్లిలో తొమ్మిదిమందిని తోసిరాజని..

జిల్లాలో ఉన్న రెండు ప్రభుత్వ ఇసుక డిపోల్లో నక్కపల్లి ఒకటి. ఈ డిపోకు యమ డిమాండ్. 10 దరఖాస్తులు వస్తే రెవెన్యూ అధికారులు మాత్రం ఒక్కరికే ఎన్‌వోసీ ఇచ్చారు. అమరావతి కూటమి పెద్దల ఆదేశాలతో.. స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిడితో బీవీఆర్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ఎన్‌వోసీ దక్కించుకోవడమే కాక డిపోను కూడా కైవసం చేసుకుందన్న విమర్శ వినిపిస్తోంది.

ప్లాన్ ప్రకారమే అచ్యుతాపురం డిపో అప్పగింత

జిల్లాలో అత్యంత డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో అచ్యుతాపురం కూడా ఒక్కటి. అలాంటి డిపోకు మొత్తం 9 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో నన్నపనేని ఎర్త్ మూవర్స్, మైత్రి ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ మాత్రమే టెండర్‌లో పాల్గొన్నాయి. చివరి నిమిషంలో కూటమి నేతల ఆదేశాల మేరకు మైత్రి సంస్థ విత్‌డ్రా చేసుకుంది. దీంతో నన్నపనేనికి పక్కా ప్లాన్ ప్రకారమే అచ్యుతాపురం డిపో కేటాయించారు. మైనింగ్ అధికారులు మాత్రం రోడ్డు లేదని తొలగించినట్లు చెబుతున్నారు.

మూడింటిని దక్కించుకున్న 'మైత్రి'

నర్సీపట్నంలో స్పీకర్ ఒత్తిడితో రెవెన్యూ అధికారులు ఒక్కరికే ఎన్‌వోసీ ఇచ్చారు. చోడవరం, మాడుగులలో స్థానిక ప్రజాప్రతినిధులు 'మైత్రి'కి మద్దతు పలికారు. వారే డమ్మీలను వేయించి.. కావాలని డ్రాప్ చేయించారు. నర్సీపట్నానికి 8 దరఖాస్తులు రాగా.. వారిలో ఎన్‌వోసీ మైత్రి ఒక్కరికే ఇచ్చారు. చోడవరం డిపోకు 3 దరఖాస్తులు రాగా.. వాటిలో ఇద్దరు వారంతటి వారే డ్రాప్ అయ్యారు. మాడుగుల డిపోకు 2 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఒకరు డ్రాప్ అయ్యారు. మొత్తానికి మూడు డిపోలు మైత్రి ఇన్‌ఫ్రాకు దక్కేలా చేశారు.

తెర వెనుక బాగోతం

- అనకాపల్లిలో అస్మదీయుడు-కొబ్బరి తోట ఉన్న స్థలానికి ఎన్‌వోసీ.. స్థానిక ఎమ్మెల్యే సోదరుడి అండతో..
- నక్కపల్లిలో ఒకే ఒక్కడు-పదిమంది దరఖాస్తు చేస్తే ఒకటే ఎన్‌వోసీ
- అచ్యుతాపురంలో ఏమి మైత్రి-నన్నపనేని ఎర్త్ మూవర్స్ కోసం మైత్రి ఇన్‌ఫ్రా త్యాగం
- నర్సీపట్నం, చోడవరం, మాడుగులలో ఇసుక దుమారం-మూడు డిపోలూ ఒక్కరికే.. మైత్రి కుదిరిన వారికే..

15 రోజుల్లో ప్రారంభించుకోవచ్చు...

టెండర్ ప్రక్రియ అంతా పారదర్శకంగానే జరిగింది. ఎన్‌వోసీ, ఇతర కారణాల దృష్ట్యా స్క్రూటినీలో కొందరిని తొలగించాం. టెండర్ దక్కించుకున్న సంస్థలు ఈ నెల 15 నుంచి డిపోలను ప్రారంభించుకోవచ్చు. ఇప్పటికే అధికారికంగా ఇసుక ధర ప్రకటించాం. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాల్సి ఉంటుంది. అతిక్రమించిన వారిపై చర్యలుంటాయి.

– శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి జిల్లా

అల్పపీడనం..

జిల్లా యంత్రాంగం అప్రమత్తం

- కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తుమ్మపాల: అల్పపీడనం ప్రభావంతో జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ విజయ కృష్ణన్ మంగళవారం ఉదయం నుంచి అప్రమత్తం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్-08924-226599, 222888 ఏర్పాటు చేశారు. ముఖ్యంగా వర్షాల నేపథ్యంలో వరికోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను వర్షాలకు ముందు కోయవద్దన్నారు. ఇప్పటికే కోసిన పంట ఆరకపోతే ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టశాతాన్ని నివారించవచ్చన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ తగిన సూచనలు సలహాలు అందించాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అందరూ వారి హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌డబ్ల్యూలతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్నీ విడిచి వెళ్లరాదని ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు.

వర్షాల వల్ల మంచినీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని తెలిపారు. అటువంటి ప్రదేశాల్లో సూచనల బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, స్లాబ్‌లు పడిపోయే అవకాశం ఉన్న భవనాలు, మట్టి ఇళ్లలో ఉన్న వారిని సురక్షిత భవనాల్లోకి మార్చాలన్నారు. తుపాను కారణంగా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులకు అవసరమైన నిత్యావసర సరుకులు, మందులు సిద్ధం చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.

గోడ కూలి ఇద్దరు వృద్ధుల మృతి



గోడ కూలిన అర్జున్న ఇల్లు



కాంతం మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

మాకవరపాలెం: ఇంటి గోడ కూలి ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలో జి.కోడూరు గ్రామానికి చెందిన వేగి అర్జున్నకు పాత పెంకుటిల్లు ఉంది. దీని సగ భాగం గతంలోనే తొలగించారు. తొలగించిన ఖాళీ స్థలంలో గోడ పక్కనే నిత్యం స్థానికులు సాయంత్రం పూట కులాసాగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటుంటారు. ఈ నేపథ్యంలో ఎప్పటిలాగే మంగళవారం సాయంత్రం కొయిలాడ కాంతం(73), వేగి భీముడు(70) ఇంటి గోడ పక్కనే కూర్చుని మాట్లాడుకుంటున్నారు. 6.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఇంటి గోడ వీరిద్దరిపై కూలిపోయింది. దీంతో కాంతం అక్కడికక్కడే దుర్మరణం చెందగా, తీవ్రంగా గాయపడిన భీముడును 108 వాహనంలో నర్సీపట్నం తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు.

క్లుప్తంగా

పొలంలోనే అన్నదాత సజీవ దహనం




మంటల్లో కాలి మృతి చెందిన చిన్నంనాయుడు

కశింకోట: తన పంట పొలంలోనే ఓ అన్నదాత సజీవ దహనమైన హృదయ విదారకర ఘటన కశింకోట మండలం తాళ్లపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాలిలా ఉన్నాయి. తాళ్లపాలెంకు చెందిన రైతు తోరం చిన్నంనాయుడు(58)కు వ్యవసాయమే జీవనాధారం. తాళ్లపాలెం సమీపంలోని తన భూమిలో వేసిన సరుగుడు తోట తొలగించిన తర్వాత మిగిలి ఉన్న కొమ్మలు, తొక్కకు నిప్పు పెట్టి శుభ్రం చేయడానికి వెళ్లాడు. అక్కడ కొమ్మలు, తొక్కకు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. ప్రమాదవశాత్తు ఆయనకు అంటుకోవడంతో అగ్నికి ఆహుతయ్యాడు. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ఆయనను రక్షించే అవకాశం లేకపోయింది. మృతునికి భార్య వరలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

శీతాకాలంలో పశువులు జాగ్రత్త

అనకాపల్లి: శీతాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామ్మోహనరావు అన్నారు. మండలంలో చినమాకవరంలో విశాఖ రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశు సంవర్ధక–పశుగణాభివృద్ధి ఆధ్వర్యంలో పశువులకు ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 56 పశువులకు గర్భకోశ వ్యాధికి చికిత్సలు, 18 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు, 40 పెయ్యిలకు నట్టల నివారణ మందు వేశామన్నారు. మండల పశు సంవర్ధక శాఖ(గవరపాలెం) అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ లేగ దూడలు, పశువుల యాజమాన్యంలో పాటించవలసిన మెలకువలు వివరించారు. ప్రభుత్వం 60 శాతం సబ్సిడీతో లింగ నిర్ధారణ వీర్యం పాడి రైతులకు అందిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాత్రి సమయంలో పశువులను మంచులో ఉంచితే పాలు శాతం తగ్గుతుందని, షెడ్లలోనే కట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకురాలు సౌజన్య, పశు వైద్యులు భానుబాబు, పృథ్వి, జేవీవో కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నగర వనం @ ఆరిలోవ

- 25 ఎకరాల్లో రూ.2 కోట్లతో ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- వైఎస్సార్‌సీపీ హయాంలోని బయ్యవరంలో పార్కుకు విశేష ఆదరణ
- ఆరిలోవ రిజర్వ్ ఫారెస్టులో ఆ తరహా పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు



నగర వనంగా అభివృద్ధి చేయనున్న ఆరిలోవ మెడిషన్ ప్లాంటేషన్

నర్సీపట్నం: పని ఒత్తిడితో కాస్త సేదతీరేందుకు వారానికొకసారి దొరికే సెలవును ఆనందంగా గడిపేందుకు ఆరిలోవ మెడిషన్ ప్లాంటేషన్ వేదిక కానుంది. జిల్లాలో ఇప్పటికే గత ప్రభుత్వ హయాంలో బయ్యవరం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతాన్ని నగర వనంగా అభివృద్ధి చేశారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడంతో సెలవు దినాల్లో ఇక్కడికి వెళ్లి పిల్లాపాపలతో సరదాగా గడుపుతున్నారు. నగర వనానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండడంతో అటవీ శాఖ అధికారులు గొలుగొండ మండలం, ఆరిలోవ నేషనల్ మెడిషన్ ప్లాంటేషన్ ప్రాంతంలో నగర వనం ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నర్సీపట్నం– అల్లూరి, కాకినాడ జిల్లాలను కలిపే రహదారికి ఆనుకుని ఆరిలోవ వద్ద ఉన్న రిజర్వ్ ఫారెస్టులోని ధన్వంతరీ వనాన్ని ఇందుకు ఎంపిక చేశారు.

ఆరిలోవ రిజర్వ్ ఫారెస్టులో వేసిన నేషనల్ మెడిషన్ ప్లాంటేషన్ నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. ఈ ప్రాంతంలో నగరవనం ఏర్పాటుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రూ.2 కోట్లతో సుమారు 25 ఎకరాల్లో నగర వనం ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో రోజు రోజుకు విస్తరిస్తున్న నర్సీపట్నంలో పార్కులు, సందర్శన ప్రాంతాలు లేక నగరవాసులకు ఆహ్లాదం కరువైంది. సినిమా థియేటర్లు తప్ప ఏవిధమైన పార్కులు లేవు. దీంతో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేయనున్న నగర వనం ప్రాధాన్యత సంతరించుకుంది.

నగర వనంలో సౌకర్యాలు

- పిల్లల పుట్టిన రోజు వేడుకలు, భోజనాలు చేసేందుకు వసతి
- పిల్లల ఊయలలు, రంగులరాట్నం, నిచ్చెన, ఇతర ఆట పరికరాలు
- వాకింగ్ ట్రాక్
- వివిధ రకాల పూల మొక్కలతో పార్కు
- చెట్ల మధ్య సేద తీరేందుకు బెంచీల ఏర్పాటు
- సోలార్ విద్యుద్దీపాలతో వెలుగులు
- పార్కులో యోగా కేంద్రం
- ఆకర్షణీయమైన వివిధ రకాల జంతువుల బొమ్మలు

అనుమతులు రాగానే పనులు



ఆరిలోవ మెడిషన్ ప్లాంటేషన్ ప్రాంతాన్ని నగర వనంగా అభివృద్ధి చేస్తాం. ఇప్పటికే జిల్లాలో బయ్యవరం వద్ద అటవీ ప్రాంతాన్ని నగర వనంగా అందుబాటులోకి తీసుకువచ్చాం. ఈ నగర వనానికి సందర్శకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఆరిలోవ వద్ద నగర వనంను ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

ఎం.శామ్యూల్,
అటవీ శాఖాధికారి, నర్సీపట్నం

భూములు తెగనమ్మాల్సిందే..

భోగాపురం విమానాశ్రయానికి రహదారుల నిర్మాణ బాధ్యత వీఎంఆర్‌డీఏపైదే..

పైసా కూడా విదల్చని కూటమి ప్రభుత్వం



బోర్డు సమావేశంలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

- చినముషిడివాడ, తుమ్మపాల ప్రాంతాల్లో భూముల అమ్మకాలకు నిర్ణయం
- ఆ నిధులతోనే ఎయిర్‌పోర్టుకు 15 రహదారుల అభివృద్ధి
- వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో ఆమోదం

విశాఖ సిటీ: రాష్ట్రానికి విశాఖే ఆర్థిక రాజధాని అని గొప్పలు చెప్పే కూటమి ప్రభుత్వం.. నగరాభివృద్ధికి మాత్రం రాష్ట్ర ఖజానా నుంచి పైసా కూడా విదిల్చడం లేదు. అమరావతి నిర్మాణానికి రూ.వేల కోట్లు సమీకరణకు ఆపసోపాలు పడుతున్న చంద్రబాబు సర్కార్.. విశాఖపై మాత్రం కనీసం సవతి ప్రేమ కూడా చూపించడం లేదు. భోగాపురంలో భారీ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి కనెక్టివిటీని పెంచేందుకు బృహత్తర ప్రణాళికలో 15 రహదారులను ప్రతిపాదించారు. ఇప్పుడా రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పైసా కూడా ఇచ్చేది లేదని తేల్చి చెప్పింది. ఆ భారాన్ని వీఎంఆర్‌డీఏపైనే మోపింది. అసలే రాబడి లేక నిర్వహణ భారంతో సతమతమవుతున్న సంస్థకు పైసా ఇవ్వకుండా ఈ రహదారుల నిర్మాణ భారం మోపడం విశాఖ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.

అప్పుడు యాగీ చేసి.. ఇప్పుడు భారం మోపి..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నవరత్నాల పథకంలో భాగంగా ఒక సెంటు భూములను అభివృద్ధి చేశారు. జిల్లాలో 83 ప్రాంతాల్లో 4,828 ఎకరాల్లో సెంటు భూముల లేఅవుట్లు చేశారు. ఇందులో మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతలను వీఎంఆర్‌డీఏకు గత ప్రభుత్వం అందించింది. దీంతో సదరు సంస్థ రూ.175 కోట్ల అంచనా వ్యయంతో ఆయా లేఅవుట్లలో రహదారులు, బోర్లు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసింది. వీఎంఆర్‌డీఏ ఖర్చు చేసే ఈ నిధులకు గాను.. ప్రత్యామ్నాయంగా బల్క్ ల్యాండ్స్ ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వం అంగీకరించింది. దీంతో ఆ భూముల నుంచి నిధులు సమకూర్చడం ద్వారా వీఎంఆర్‌డీఏపై భారం మోపకుండా చర్యలు తీసుకుంది. అయినప్పటికీ అప్పట్లో కూటమి నేతలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేశారు. పేదల లేఅవుట్ల అభివృద్ధి భారం వీఎంఆర్‌డీఏపై మోపిందని నానా యాగీ చేశారు. కానీ ఇప్పుడు ప్రత్యామ్నాయ ఆదాయం చూపించకుండా రహదారుల నిర్మాణ భారం మోపడం గమనార్హం.

రహదారుల నిర్మాణాలకు భూముల అమ్మకాలు

భోగాపురం విమానాశ్రయానికి రహదారులను అభివృద్ధి చేసేందుకు వీఎంఆర్‌డీఏ వద్ద నిధులు లేవు. ఈ బృహత్తర ప్రణాళిక రహదారులను నిర్మించాలంటే సంస్థకు చెందిన భూములు అమ్మాల్సిందే. దీంతో ఆ దిశగా కసరత్తు కూడా ప్రారంభమైపోయింది. వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో భూముల అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. చినముషిడివాడ, తుమ్మపాల ప్రాంతాల్లో ఉన్న భూములను విక్రయించి నిధులు సేకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఆ నిధులతో భోగాపురం విమానాశ్రయానికి బృహత్తర ప్రణాళికలో ప్రతిపాదించిన 15 రహదారులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

పలు ప్రాజెక్టులకు ఆమోదం

వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో ఆమోదం తెలిపిన ప్రాజెక్టులు

- వీఎంఆర్‌డీఏ పరిధిలో కొత్తగా విలీనమైన 13 మండలాలకు బృహత్తర ప్రణాళిక రూపకల్పన.
- యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీలకు, నెల్లిమర్ల గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు (రహదారులు, కాలువల), ఇతర అభివృద్ధి పనులకు రూ.9 కోట్లు కేటాయింపు.
- రూ 200 కోట్ల వ్యయంతో కేంద్రం, వీఎంఆర్‌డీఏ 90:10 నిష్పత్తిలో తీరం కోత నియంత్రణ ప్రాజెక్టు.
- మధురవాడలో ఒలింపిక్స్ ప్రమాణాలకు అనుగుణంగా 2.7 ఎకరాల్లో క్రీడా సముదాయ నిర్మాణం.
- రుషికొండలో పీపీపీ విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో హ్యాబిటేట్ సెంటర్ నిర్మాణం.
- రుషికొండ, గంభీరాల వద్ద వాటర్ స్పోర్ట్స్ ప్రాజెక్టు.
- ఫార్మా సిటీలో ప్రమాదాలు జరిగిన సమయంలో చికిత్స అందించేందుకు, అనకాపల్లి ప్రజల వైద్య సదుపాయాల కోసం అనకాపల్లి దగ్గర 7.68 ఎకరాల్లో హెల్త్ సిటీ నిర్మాణం.
- అనకాపల్లి జిల్లా తుమ్మపాలలో రూ.2.68 కోట్లతో వాణిజ్య, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం.
- రీసైకిల్ (వేస్ట్ ప్లాస్టిక్) వినియోగించి ప్రయోగాత్మకంగా రహదారుల నిర్మాణం. దీని ద్వారా నిర్మాణ వ్యయం 5–8 శాతం ఆదా అవుతుందని అంచనా.
- విశాఖ సెంట్రల్ పార్క్‌లో ప్రస్తుతమున్న మ్యూజికల్ ఫౌంటెన్‌ను 40 నెలల నిర్వహణ నిమిత్తం రూ 1.84 కోట్లతో అంచనాలు.
- 2021–2022 , 2022–2023, 2023–2024 ఆర్థిక సంవత్సరాల పద్దులు ఆమోదం.

కనుల పండువగా జైనుల శోభాయాత్ర

నేడు వాసుపూజ్య స్వామీజీ విగ్రహ ప్రతిష్ట



గుర్రపు బండిపై జైన్ చిన్నారులు



వాసుపూజ్య స్వామీజీ విగ్రహ పతిష్టలో భాగంగా స్వామీ చిత్రపటంలో గుర్రంపై శోభాయాత్ర

అనకాపల్లి : పెరుగుబజార్ సమీపంలో జైన్ మందిరం నూతన ఆలయ నిర్మాణంలో ఈనెల 11న 'వాసుపూజ్య స్వామీజీ' విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్టు మందిరం అధ్యక్షుడు జగ్గురాజ్‌జైన్ అన్నారు. విగ్రహ ప్రతిష్టలో భాగంగా ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకూ స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మంగళవారం స్వామివారి చిత్రపటాన్ని గుర్రాలపై జైన్ మతస్తులు పెరుగుబజార్ జంక్షన్ నుంచి శారదానది బ్రిడ్జి వరకూ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సుమారుగా 3 ఏళ్లు పట్టిందన్నారు. 11న స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వాసుపూజ్య స్వామీజీ విగ్రహ ప్రతిష్ట జరుగుతుందన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో మందిరం ఉపాధ్యక్షుడు వీరాచంద్‌జైన్, కార్యదర్శి మహావీర్ కుమార్‌జైన్ పాల్గొన్నారు.

బకాయిల కోసం చెరకు రైతుల నిరసన



ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం తక్షణం చెరకు రైతుల బకాయిలు చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫ్యాక్టరీ పరిపాలన భవనం ఎదుట సంఘం నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సీజన్‌కు సంబంధించి రూ. 7 కోట్ల మేర రైతులకు చెరకు బకాయిలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది క్రషింగ్ సీజన్ వెంటనే ప్రారంభించాలని, టన్నుకు మద్దతు ధర ఇవ్వాలన్నారు. సకాలంలో చెల్లింపులు జరగక, మద్దతు ధర లభించకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా సరుగుడు, ఇతర పంటల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహాజన సభలో ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడికి అందజేశారు. ఈ ఆందోళనలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, సహాయ కార్యదర్శి ఎస్.వి.నాయుడు, సభ్యులు బి.దేముళ్లు, శరగడం విశ్వనాథం, బుద్దరిగి పెంటయ్య, పొలమరశెట్టి తాతఅప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వేంపాడు వద్ద కారు బోల్తా



వేంపాడు వద్ద బోల్తాపడిన కారు

నక్కపల్లి: జాతీయ రహదారిపై వేంపాడు జంక్షన్ సమీపంలో కారు బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. మంగళవారం రాజమండ్రి నుంచి విశాఖ వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టి అవతల మార్గంలోకి వచ్చి బోల్తా పడింది. ఆ సమయంలో కారులో నలుగురు ఉన్నారు. అదృష్టవశాత్తూ వారెవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

గుర్తు తెలియని వ్యక్తి మృతిపై కేసు



యలమంచిలి రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై కే సావిత్రి మంగళవారం రాత్రి తెలిపారు. పట్టణంలోని క్లబ్ రోడ్డులో ఈ నెల 8వ తేదీన స్పృహ కోల్పోయి పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని 108 అంబులెన్సులో మొదట యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అదే రోజు అనకాపల్లోల్ల ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు.

పాము కాటుకు గురై వ్యక్తి మృతి

అనకాపల్లి: పాముకాటుకు గురై మండలంలో తుమ్మపాల గ్రామానికి చెందిన కొణతాల ఈశ్వరి జగ్గప్పారావు మృతి చెందాడు. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుమ్మపాల పంచాయతీ గవరపేట వీధికి చెందిన జగ్గప్పారావు కుటుంబంతో కలిసి పొలంలో పని చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెరుగుతున్న దాడులు.. మండిపడ్డ మహిళలు



నెహ్రూచౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

అనకాపల్లి: రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మణికుమారి విమర్శించారు. ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకూ మహిళలపై దాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మద్యం ఏరులై పారుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. మహిళలపై హింసకు కారణమవుతున్న మత్తు పదార్థాలను, మద్యాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే నియంత్రించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి మహిళలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.వి.వరలక్ష్మి, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి వెండి రథం ప్రారంభోత్సవం



వెండిరథాన్ని ప్రారంభిస్తున్న మాజీ రాజ్యసభ సభ్యుడు టి.జి. వెంకటేష్

అనకాపల్లి : స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రతిష్ట శతజయంతి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని మాజీ రాజ్యసభ సభ్యుడు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు టి.జి.వెంకటేష్ అన్నారు. మంగళవారం కన్యకాపరమేశ్వరి అమ్మవారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, దేవస్థానానికి దాతలు సహాయంతో కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు కోసం వెండి రథం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి శతజయంతి ఉత్సవాల్లో తాను పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వెండి రథం ప్రాజెక్టు చైర్మన్ అల్లెపు కామేశ్వరరావు మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏడాది పాటు అమ్మవారికి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వెండి రథాన్ని పట్టణంలో పురవీధుల గుండా ఊరేగించారు. అంతకుముందు టి.జి.వెంకటేష్‌ను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, విశాఖ పైడా విద్యాసంస్థలు చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, వాసవీ సత్ర సముదాయం ప్రధాన కార్యదర్శి ఇల్లూరి లక్ష్మయ్య, దుబాయ్ ఎస్‌డెక్స్ ఎమిరేట్ సీఎండీ రాయపూడి గణేష్, లక్ష్మీ షాపింగ్‌మాల్ డైరెక్టర్ గ్రంధి శ్రీనివాసరావు, ఆలయ శత జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

నర్సీపట్నం : సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి గ్రామానికి చెందిన బి.నాగమణి వద్ద 3 లీటర్లు, ఆర్.రత్నం వద్ద 5.2 లీటర్ల సారాను ఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

వీరిని కోర్టులో హాజరు పరచడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది నాగశంకర్, మాణిక్యాలరావు, లావణ్య ఉన్నారని సీఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు మాజీ మంత్రి గుడివాడ పరామర్శ



మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

నర్సీపట్నం: హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో రోబోటిక్ హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద కోలుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం పరామర్శించారు. ఆరోగ్యం గురించి ఆరా తీసి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమర్నాథ్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మాకవరపాలెం మండలంకు చెందిన బొడ్డు గోవిందరావు, రుత్తల సర్వం, రుత్తల శ్రీనువాసరావు, రాజుబాబు, పెట్ల భద్రాచలం, తమరాన శ్రీనివాసరావు, పలువురు పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

వరి కోతకు ముందు జనుములు విత్తడం మేలు

అనకాపల్లి: వరి చేను కోసే రెండు, మూడు రోజుల ముందు పొలంలోని తేమను వినియోగించుకుని జనుము విత్తనాలు చల్లుకుంటే లాభదాయకంగా ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీలో వరి సాగు కోసం నారుమడి వేసుకోవచ్చుని, ఎకరానికి 20–25 కిలోల వరి విత్తనం సరిపోతుందన్నారు. దుక్కిలో 5 సెంట్ల నారుమడికి 2.2 కిలోల యూరియా, 6.25 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.6 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలని ఆయన సూచించారు. నారుమడి వేసిన 4–7 రోజులప్పుడు కలుపు నివారణకు పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ కలుపు మందును ఎకరానికి 100 గ్రాముల చొప్పున 25 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. రబీలో రాగి వేసే రైతులు ఎకరానికి 2.5 కిలోల విత్తనం చొప్పున చల్లుకోవాలని, విత్తే ముందు కిలో విత్తనానికి 2 గ్రా. కార్బెండజిం లేదా 3 గ్రా. మాంకోజెట్ మందుతో కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. 5 సెంట్ల నారుమడికి 1.5 కిలోల యూరియా, 4 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.0 కిలో మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలన్నారు. చెరకు మొక్క తోటకంటే ముందుగా కార్శి తోటలను నరుకుకోవాలని, బెల్లం చేసుకునే రైతులు పంచదార శాతం క్రింది కణుపులలో ఎక్కువగా ఉంటుందని, కాబట్టి చెరకును నేలకు దగ్గరగా నరకాలని సూచించారు. చెరకు నరకిన 24 గంటలలో బెల్లం ఆడుకోవాలని ఆయన చెప్పారు. ఒకటి లేదా రెండు తడులు పెట్టే వీలున్నట్లయితే వరి మాగాణుల్లో అపరాలు వేసుకోవచ్చని, కాప్టన్ 2.5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ 5 మీ.లీ విత్తనానికి చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. తరువాత విత్తనాన్ని నీడలో ఆరబెట్టి ఎకరాకు సరిపడే విత్తనాన్ని 200 గ్రా.ల రైజోబియం కల్చరును విత్తే గంట ముందు విత్తనానికి పట్టించి విత్తుకోవాలని ఆయన పేర్కొన్నారు.

12 కేజీల గంజాయితో ఐదుగురి అరెస్ట్

అనకాపల్లి: ఏఎస్ఆర్ జిల్లా హుకుంపేట మండలం నుంచి అనకాపల్లికి గంజాయిని ఆటోలో తరలిస్తుండగా స్థానిక గుండాల జంక్షన్ వద్ద మంగళవారం ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణ సీఐ విజయకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో 12 కేజీల గంజాయిని గుర్తించారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన అరవింద్ కుమార్, సంజీవన్ మోహన్‌రాజ్ ఆటోలో వస్తుండగా.. వారికి దారి చూపిస్తూ హుకుంపేట మండలం, కేయాకు చెందిన పాంగి కేశవరావు, సీదరి గాసన్న, సిదిరి మురళి బైక్‌పై అనుసరిస్తున్నారని సీఐ చెప్పారు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

దీర్ఘకాలిక భూ సమస్యలు పరిష్కరిస్తాం



యాప్ ద్వారా సమస్యలు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కశింకోట: రెవెన్యూ సదస్సులో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలు పరిష్కరించనున్నామని తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. మండలం లోని జి. భీమవరంలో రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత రీసర్వేలో లోపాలు, తప్పులను సవరిస్తామన్నారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలకు సంబంధించి ఐదు అర్జీలను సభలో అందించారు. కార్యక్రమంలో వీఆర్వో ఉదయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పడమటమ్మ ఉత్సవం

కశింకోట: మండలంలోని బయ్యవరంలో మంగళవారం రాత్రి పడమటమ్మ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని భక్తులు ఎక్కువగా దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, అరటి గెలల రూపంలో మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామం నుంచి రైల్వే గేటు అవతల ఉన్న ఆలయం వరకు అమ్మవారి జాతర ఊరేగింపు నిర్వహించారు. బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

మినీ క్రిస్మస్‌కు సన్నాహాలు



కశింకోట: స్థానిక ఆంధ్ర కల్వరీ సెంటినరీ బాప్టిస్టు చర్చిలో త్వరలో మినీ క్రిస్మస్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా చర్చిని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించి ముస్తాబు చేశారు. చర్చి ప్రాంగణంలో రంగుల విద్యుద్దీపాలతో అలంకరించి క్రిస్మస్ చెట్టును ఏర్పాటు చేశారు. ఇది ఆహూతులను ఆకట్టుకుంటోంది.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 2,720 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,500	4,720
మొదటి రకం	3,590	4.260
రెండో రకం	3,060	3,800
మూడోరకం	2,840	3,080

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
పుష్ప-2	: పర్తిసాయి
పుష్ప-2	: షిర్డీసాయి
లక్ష్మీ భాస్కర్	: వెంకటేశ్వర
దేవర	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 348 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

స్మార్ట్‌గా బాదుడు

- ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రతి నెలా అదనపు వసూళ్లు
- స్మార్ట్ మీటర్ల భారం ప్రజలపైనే.. ● బిల్లుల పెంపుతో అదనపు భారం
- అధికారంలోకి రాగానే మాట మార్చిన కూటమి ప్రభుత్వం



ట్రూఅప్ చార్జీల వసూలు ఆలోచనను వెనక్కి తీసుకోవాలని నిరసన చేస్తున్న వినియోగదారులు (ఫైల్)



ఈ నెల విద్యుత్ బిల్లులో ఎఫ్‌పీపీసీఏ, ఎఫ్‌పీపీసీఏ2 అదనపు చార్జీలు

తుమ్మపాల: ఏరుదాటే దాక ఓడ మల్లన్న ఏరు దాటక బోడు మల్లన్న అన్నట్టుగా కూటమి ప్రభుత్వం తీరు ఉంది. ఐదేళ్ల పాటు ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తామంటూ సూపర్ సిక్స్ పథకాలతో ఎన్నికలప్పుడు ప్రచారాన్ని ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజలను ముప్పుతిప్పలు పెడుతోంది. అధికారం చేపట్టి ఐదు నెలలు కావస్తున్నప్పటికీ ఏ ఒక్క పథకాన్ని పూర్తిస్థాయిలో అందించలేదు. సరికదా ప్రజలను మరిన్ని కష్టాల్లోకి నెట్టుతుండటంతో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయకపోగా, కూరగాయల ధరలు నుంచి విద్యుత్ ధరల వరకు అన్నింటిని పెంచుకుంటూ వస్తోంది. ఈ నెల నుంచి ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ బిల్లులు మోత కూడా జతకావడంతో సగటు కుటుంబాలు లబోదిబోమంటున్నాయి.

● ట్రూఅప్ చార్జీల పేరుతో అదనపు వసూళ్లు...

ఇప్పటికే విద్యుత్ బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కూటమి ప్రభుత్వం ఈ నెల నుంచి విద్యుత్ బిల్లుల్లో అదనంగా ట్రూఅప్ చార్జీలంటూ వసూలుకు సిద్ధమైంది. విద్యుత్ బిల్లుల్లో ఎఫ్‌పీపీసీఏ, ఎఫ్‌పీపీసీఏ2 చార్జీలుగా రూ.200 నుంచి రూ.300 అదనంగా విద్యుత్ బిల్లుకు జోడించడంతో ప్రజలు ఆందోళనలకు సిద్ధమయ్యారు. గత నెలలో లేని చార్జీలను ఈ నెల నుంచి వసూలు చేస్తూ ప్రభుత్వానికి గతేడాది, ప్రస్తుత ఏడాది కలిపి రావాల్సిన ఆదాయంగా రూ.15 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపేసి వసూళ్లు ప్రారంభించారు.

● ఉద్యమాలకు సిద్ధమైన ప్రజలు

గతేడాదితో పాటు 2024-25 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదనల ద్వారా ప్రజలపై వేసిన రూ.15,184 కోట్ల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లు బిగింపు నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ వినియోగదారులు ప్రజా సంఘాలతో నిరసనలకు సిద్ధమయ్యారు. విద్యుత్ వినియోగదారులపై రూ.16,484 కోట్ల భారం వేసి 2023-24 సంవత్సరంలో వినియోగించుకున్న విద్యుత్‌పై యూనిట్‌కు ప్రతి నెలా అదనంగా రూ.60 పైసల నుంచి రూ.2.50 పైసలు వరకు భారం వేస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ సంస్థల అసమర్థ విధానాలు, అవినీతి, ఐదా సంస్థలకు అదనపు చెల్లింపులు, ప్రభుత్వ థర్మల్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి అధిక రేట్లతో బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేయటం, సర్‌చార్జీలు, వడ్డీలు ఇతర అంశాలు ఈ భారానికి కారణాలు చూపి ప్రజలపై భారం వేయరాదని డిమాండ్ వస్తున్నాయి.



దుకాణాల్లో బిగించిన స్మార్ట్ మీటర్లు

● స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపైనే ఖర్చుల వడ్డింపు....

అదానీ సంస్థ ఆదాయాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరం లేని స్మార్ట్ మీటర్లను ప్రజల నెత్తిన పెట్టి, వాటి ఖర్చులను వారిపైనే మోపేందుకు సిద్ధమవుతుంది. అతి తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే స్మార్ట్ మీటర్లకు వేలాది రూపాయల ఖర్చులు చూపి ప్రతి నెలా విద్యుత్ బిల్లులో చేర్చి ప్రజల నుంచి వసూలు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం తయారైంది. వ్యవసాయ పంపుసెట్లకు, గృహ వినియోగదారులు, వ్యాపార, పరిశ్రమలు, సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగించి ప్రీ పెయిడ్ బ్యాలెన్స్ వేయించుకోవాలనడం, రీచార్జ్ చేసుకోవడం, ముందుగానే మూడు నెలల బిల్లు అడ్వాన్సుగా కనెక్షన్ తీసుకున్నప్పుడే వసూలు చేసే చర్యలకు పాల్పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు గతంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి ఇప్పుడు దానికి భిన్నంగా స్మార్ట్ మీటర్లను ప్రోత్సహించే పరిస్థితికి రావడంతో తమ గోడును వినే నాథుడు లేక వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు.

పెంచిన విద్యుత్ బిల్లులు తక్షణమే నిలిపివేయాలి



విద్యుత్ చార్జీల పెంపుపై గత ప్రభుత్వ హయాంలో వ్యతిరేకించిన కూటమి నాయకులు ఇప్పుడు అధికారంలోకి వచ్చి ట్రూఅప్ పేరుతో బిల్లులు పెంచడం వల్ల ప్రజలు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. చార్జీలతో పాటు స్మార్ట్ మీటర్లు బిగింపు నిలిపివేయాలని కోరుతున్నాం. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపడం సరికాదు.

– బి. ఉమామహేశ్వరరావు, వినియోగదారుడు, అనకాపల్లి

ప్రజల జీవన స్థితిగతులపై ప్రభావం



ప్రభుత్వాలు, విద్యుత్ సంస్థల అనాలోచిత విధానాలతో విద్యుత్‌ను కొనుగోలు చేసి భారాన్ని ప్రజలపై మోపడం సరైన నిర్ణయం కాదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి సగటు మానవుడి కుటుంబ ఖర్చులు విపరీతంగా పెరుగుతూ వస్తున్నాయి. ఇప్పుడు విద్యుత్ చార్జీలను పెంచితే ప్రజలు జీవన స్థితిగతులపై తప్పకుండా ప్రభావం చూపుతాయి. అవసరం లేని స్మార్ట్ మీటర్లు వేసి ప్రజలపై మరింత భారాన్ని మోపుతున్నారు. ప్రభుత్వాలు తక్షణమే సరైన నిర్ణయం తీసుకుని అదనపు చార్జీల ఆలోచనను నిలిపి వేయకపోతే ప్రజల్లో ఉద్యమించక తప్పదు.

– పెంటకోట శ్రీనివాసరావు, వినియోగదారుడు, అనకాపల్లి

వెలమ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న పి.వి.జి.కుమార్

అనకాపల్లి: వెలమ కులస్తుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ సంస్థ చైర్మన్ పి.వి.జి. కుమార్ తెలిపారు. స్థానిక గాంధీనగరం సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి తగిన నిధులు తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి, ఆయా ప్రాంతాల ప్రజలు సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కూండ్రపు భీమ, గౌరవాధ్యక్షుడు రాజాన అప్పారావు, నాయకులు లాలం కన్నాజీ, వాసిరెడ్డి బాలకృష్ణ, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై నిర్లక్ష్యంతో ప్రమాదాలు

నర్సీపట్నం : ప్రస్తుతం రోడ్లపై అత్యధిక ప్రమాదాలు ద్విచక్ర వాహనదారుల నుంచి నమోదవుతున్నాయని, దీనికి ప్రధాన కారణం హెల్మెట్ ధరించకపోవడమేనని నర్సీపట్నం టౌన్ సీఐ జి.గోవిందరావు పేర్కొన్నారు. పోలీసు, సీఎంఆర్ షాపింగ్ మాల్ సిబ్బంది రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ ధారణపై పట్టణంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ యువత బైక్‌లను ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా నడపడంతో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వాహనదారుడు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు లైసెన్స్, ఇన్సూరెన్స్, టాక్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్‌లకు వాహనాలను ఇవ్వరాదన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాల్లో అధికంగా తలకు గాయాలై చనిపోవడం, వికలాంగులు కావడం జరుగుతుందన్నారు. వాహనం నడిపేటప్పుడు మైబైల్ వాడడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలన్నారు. ఎస్ఐలు రమేష్, ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం పరిశీలన



వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ప్రతినిధి డాక్టర్ లూసీ కార్డిలియా

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అనకాపల్లి మండలం సత్యనారాయణపురం-2 హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం సందర్శించి పరిశీలించింది. వైద్యురాలు లూసి కార్డిలియా బృందానికి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది గర్భిణులు, కిశోర్ బాలికలకు నిర్వహిస్తున్న రక్త పరీక్షలు పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య, ఆరోగ్య సేవల గురించి విచారించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీపీవో జగదీష్, ఎస్‌వో రామచంద్రరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు, హెచ్‌ఈవో సత్యనారాయణ, సీహెచ్‌వో, సూపర్ వైజరు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తుపాను భయం

ఆందోళనలో రైతులు



బయ్యవరంలో పండిన వరి పొలాలు



కశింకోట కనకమహాలక్ష్మి వీధిలో సేకరించి ఆరేసిన వరి ధాన్యం

కశింకోట: మండలంలో చాలా వరకు ఖరీఫ్ వరి పండింది. తక్కువ కాల పరిమితి కలిగిన తేలిక రకాలు ముందుగా పండటంతో రైతులు వాటిని కోసి కూడదీసుకోవడంపై దృష్టి నిలిపారు. ఒక పక్క వర్షాలు, తుపాను భయం పొంచి ఉన్న నేపథ్యంలో పండిన పంటను కాపాడుకోడానికి ప్రయత్నిస్తున్నారు. మండలంలో 1360 హెక్టార్లలో ఈ ఏడాది అత్యధికంగా ఖరీఫ్ వరి వేశారు. వాటిలో ఆర్జీఎల్, సోనా మసూరి, సాంబమసూరి తదితర రకాలు ఎక్కువగా వేశారు. వీటిలో ఎక్కువ కాలపరిమితి ఉన్న ఆర్జీఎల్ రకం ముందుగా వేసిన చోట, మిగిలినవి తక్కువ కాల పరిమితివి కావడంతో ఇప్పటికే పండాయి. ఇటీవల తుపాను వర్షాల నేపథ్యంలో కొంత కాలం పండిన పొలాలు అధికారుల హెచ్చరికలతో కోత కోయకుండా వాయిదా వేసి విరామం ఇచ్చారు. ఇప్పుడు తమిళనాడు ప్రాంతంలో తుపాను ప్రభావం వల్ల మేఘాలు వేస్తున్నప్పటికి వర్షాలు లేకపోవడంతో పండిన పంటను కూడదీసుకోవడంపై రైతులు దృష్టి నిలిపారు. దీంతో కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, తాళ్లపాలెం, జమాదులపాలెం, గొబ్బూరు, జెట్టపురెడ్డితుని, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, అచ్చెర్ల, చెరకాం, అడ్డాం, తీడ, జి. భీమవరం తదితర గ్రామాలో వేసిన వరి పండిన చోట కోతలు కోసి దులిపి రైతులు కూడదీసుకుంటున్నారు. తుపాను వర్షాలు పొంచి ఉన్నప్పటికి పండిన పొలం నుంచి ధాన్యం రాలిపోతుండటంతో నష్టాన్ని తగ్గించుకోవడానికి పొలాల కోతలు కోస్తున్నామని రైతులు అంటున్నారు. అవకాశం ఉన్న వారు కోసిన వెంటనే ధాన్యాన్ని సేకరించి ఇళ్లకు చేరుకుంటున్నారు. మిగిలిన వారు కుప్పలు పెడుతున్నారు. వాతావరణం అనుకూలిస్తే పండిన మేరకు ఈ నెలాఖరుకు దాదాపు వరి కోతలు పూర్తి కాగలవని రైతులు ఆశిస్తున్నారు.

'పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో మంగళవారం శానిటేషన్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలల నుంచి జీతాల్లేక శానిటేషన్ కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పారిశుద్ధ్య కార్మికులకు చెల్లించాల్సిన ఆరు నెలల జీతాలను తక్షణమే చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, యూనిఫాం వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. శానిటేషన్ యూనియన్ మండల అధ్యక్షులు పి.రామలక్ష్మి, కార్యదర్శి ముత్యాలమ్మ, బి.పార్వతి పాల్గొన్నారు.

మినప పంట బీమాకు 15 వరకే గడువు

రోలుగుంట: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బుచ్చింపేట, వడ్డిప గ్రామాల్లో వ్యవసాయాధికారి పొలంబడి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులు సాగు చేస్తున్న పంటలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దీనిలో మినుము పంట సాగుకు బీమాకు సంబంధించిన కరపత్రాన్ని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పాతల లక్ష్మీ రమణమ్మతో కలిసి ఆవిష్కరించారు. ప్రీమియం, బీమా మొత్తంపై వివరించారు.

ఈ నెల 15 వరకు మాత్రమే గడువు ఉందన్నారు. ఇలా ఉండగా తుపాను హెచ్చరికల నేపథ్యంలో మూడు రోజుల పాటు వరి పంట కోతల పను లు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి కోరారు. కోతలు కోసి ఉంటే పనల మీద 5 శాతం ఉప్పు ద్రావణాన్ని లీటరు నీటిలో మిశ్రమం చేసి చల్లాలన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు గవరజగ్గయ్యపాలెంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పెందుర్తి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్సర్ ఆలీ(25) స్థానికంగా సోఫా తయారీ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆలీకి గతంలో పెళ్లై, భార్యతో విడాకులు తీసుకున్నాడు. ఈ క్రమంలో ఇంకో పెళ్లి చేసేందుకు కుటుంబ సభ్యులు సంబంధం చూడగా ఆఖరి నిమిషంలో తప్పిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన ఆలీ.. కుటుంబ సభ్యులకు ఆదివారం రాత్రి వీడియో కాల్ చేసి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం సాయంత్రం ఉత్తరప్రదేశ్ నుంచి పెందుర్తి చేరుకున్న కుటుంబ సభ్యు లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

13న సబ్ జూనియర్ ఆర్చరీ ఎంపిక పోటీలు

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ఈ నెల 13న ఏపీ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్ రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో పాల్గొనేందుకు ఉమ్మడి విశాఖ ఆర్చర్ల ఎంపిక జరగనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. పాస్‌పోర్టు సైజు ఫోటో, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాల్సిందిగా సూచించారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ మన నేపథ్యం, జాతి, మతం, నమ్మకాలతో సంబంధం లేకుండా మానవ హక్కులు అందరికీ సమానమేనన్నారు. ప్రతి వ్యక్తికి సంబంధించిన హక్కులను రక్షించడం ప్రభుత్వాల విధి అని, పౌరుల సామాజిక, ఆర్థిక హక్కులకు భారత రాజ్యాంగం పూర్తి రక్షణ కల్పించిందని తెలిపారు. పౌరులు తమ హక్కులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వవిద్యాలయ ఆచార్యులు నందిని, డాక్టర్ దయానందమూర్తి, నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మి తదితరులు మానవ హక్కుల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ స్థలం కబ్జాకు యత్నం

చర్యలకు వెనుకాడుతున్న అధికారులు

నర్సీపట్నం : కోట్ల రూపాయలు విలువ చేసే ఆర్‌అండ్‌బీ స్థలాన్ని పక్కనే ఉన్న స్థలదారుడు అవసరాలకు వినియోగించుకుంటుంటే ఆర్‌అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి పీనారపాలెంలో ఉన్న ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి ఎదురుగా మెయిన్ రోడ్డుకు అనుకోని 10 సెంట్లు ఆర్‌అండ్‌బీ స్థలం ఉంది. ఆ స్థలాన్ని గతంలో ఆక్రమించేందుకు ప్రయత్నించారు. అప్పట్లో ఉన్న అధికారులు సర్వే చేయించి కాంపౌండ్‌వాల్ నిర్మించారు. ఆర్‌అండ్‌బీ స్థలాన్ని అనుకుని ఉన్న ప్రైవేట్ స్థలంలో ఇటీవల నిర్మాణం చేపట్టారు. ఆర్‌అండ్‌బీ స్థలానికి నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను దర్జాగా తొలగించి నిర్మాణ సామగ్రి ఆ స్థలంలో వేసుకున్నారు. డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని ఇలా ప్రైవేటు వ్యక్తులు వినియోగించుకుంటున్నా చర్యలకు వెనకాడుతున్నారు. దీంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఏఈ కె.నారాయణరెడ్డిని సంప్రదించగా కాంపౌండ్‌వాల్ తొలగించిన వెంటనే హెచ్చరించామన్నారు. 10 సెంట్లకు సంబంధించిన రికార్డు గతంలో పని చేసిన అధికారులు ఇవ్వలేదని, సర్వేకు తహసీల్దార్‌కు లెటర్ పెట్టామని అన్నారు. హద్దులు నిర్ధారించి స్థలం ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యతోనే సమాజంలో అనేక మార్పులు



మాట్లాడుతున్న న్యాయవాది కేతా కుసుమ



హాజరైన హెచ్ఎంలు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

అనకాపల్లి: సమాజంలో విద్యతోనే అనేక మార్పులు వస్తాయని, గ్రామీణ స్థాయి నంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని న్యాయవాది కేతా కుసుమ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం మేడపైన మండల స్థాయి కిశోరి-వికాసం అనే అంశంపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో 11 నుంచి 18 సంవత్సరాల పిల్లల చదువుపై దృష్టి సారించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఆట పాటల ద్వారా విద్యను అందించడం వల్ల వారిలో మానసిక ఒత్తిడి తగ్గి విద్యకు దగ్గరవుతారని పేర్కొన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని పేర్కొన్నారు. సీడీపీవో పి.ప్రభావతి మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్న పిల్లలను చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ఉన్నారని, ప్రపంచంలో మనదేశానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. 36 వారాల పాటు గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామని, ప్రతీ గ్రామానికి ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమిటీలో హెచ్ఎం, ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో కిశోర్ బాలికలు అందరినీ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. పట్టణ మహిళా ఎస్ఐ మణికుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొనే సమస్యలు ఉన్నాయని, మహిళలు తమను తాము రక్షించుకోవాలనే దానిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోక్సో చట్టంపై వివరించారు. ఈ కార్యక్రమంలో సీడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి చిన్నారావు, తుమ్మపాల ఎస్‌వీడీఎస్ ప్రతినిధి కె.చైతన్య, సీడీపీవో శశికళ తదితరులు పాల్గొన్నారు.